రైతులకు మేలు చేసేందుకే నూతన రెవెన్యూ చట్టం

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన రెవెన్యూ చట్టం-2024ను పటిష్టంగా రూపొందిస్తుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో రెవెన్యూ చట్టం-2024 ముసాయిదా చర్చా వేదిక కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న కొత్త రెవెన్యూ చట్టం.. పేదలు, రైతులకు మేలు చేసే విధంగా రూపొందిస్తున్నారని చెప్పారు. సేవలు సులభంగా, వేగంగా అదందంతో పాటు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. ఒకరిద్దరి అవసరాలకు కాకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా రికార్డు ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)చట్టం -2024 ముసాయిదా ఉందని అన్నారు. మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న అవసరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా దీని రూపకల్పన జరిగిందని చెప్పారు. కొత్త చట్టంలో అధికారాల వికేంద్రీకరణ కారణంగా ప్రజలకు గ్రామ, మండల స్థాయిలోనే సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. క్షేత్రస్థాయిలో భూపరిపాలన వ్యవస్థలను బలోపేతం చేస్తూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కొత్త చట్టం అవసరమైందని అన్నారు. ఈ చట్టంలో 20 సెక్షన్లు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం కొత్త చట్టం ముసాయిదాను అందరికీ అందుబాటులో ఉంచిందని అన్నారు. చర్చా కార్యక్రమంలో వెలిబుచ్చిన అభిప్రాయాలను డ్రాఫ్ట్ రూపంలో నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ వివరించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని, నూతన చట్టాన్ని ఆహ్వానిస్తున్నామని అన్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ మాట్లాడుతూ ఆగస్టు 2 నుంచి 23 వరకు సిసిఎల్ఏ వెబ్‌సైట్‌లో అభ్యంతరాల స్వీకరణలకు తమ అభిప్రాయాలను పోస్టు ద్వారాగానీ, వెబ్ సైట్‌లోగాని దరఖాస్తు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని అన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు భూమికి ఒక నంబర్ ఉండాలన్న ఉద్దేశంతో భూధార్‌ను ప్రభుత్వం ప్రవేశపెడుతుందని తెలిపారు. రిటైర్డు రెవెన్యూ అధికారి మనోహర్ మాట్లాడుతూ గ్రామస్థాయి రికార్డులన్నిటినీ డిజిటల్ రూపంలో భద్రపరచాలని సూచించారు. క్వాలిటీ విలేజ్ అడ్మినిస్ట్రేషన్ నిర్వహించాలని అన్నారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఛత్తీస్‌గఢ్‌లో అమలు చేస్తున్న విధానాలు ఉపయోగంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రిటైర్డు తహసీల్దార్లు ఆంజనేయులు, చంద్రయ్య మాట్లాడుతూ గతంలో భూమి రిజిస్ట్రేషన్లు జరిగినపుడు చాలా అవకతవకలు జరిగాయని, వీటిని సరిదిద్దాలని అన్నారు. రికార్డులను పాదర్శకంగా నిర్వహించాలని కోరారు. జమాబందీ ప్రతి సంవత్సరం నిర్వహించాలని సూచించారు. న్యాయవాది లచ్చిరెడ్డి మాట్లాడుతూ తహసీల్దార్‌లకు ఈ చట్టంలో పరిమిత అధికారాలు ఉండాలని అన్నారు. మరో న్యాయవాది కొరివి వేణుగోపాల్ మాట్లాడుతూ ధరణితో చాలా మంది రైతులు నష్టపోయారని, వాటిని సరిదిద్దాలని అన్నారు. గ్రామాలు, మండలాల్లో చెరువులు, కుంటలు అన్యాక్రాంతం అవుతున్నాయని, ల్యాండ్ రిజిస్ట్రేషన్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో నమోదు పకడ్బందీగా చేయాలని కోరారు. రైతు కోణంలో, రైతు కళ్లలో ఆనందం చూడాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, రిటైర్డు రెవెన్యూ అధికారులు అంజయ్య, కేశవులు, న్యాయవాదులు, విద్యావేత్తలు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



రెవెన్యూ చట్టం-24 ముసాయిదా చర్చా వేదికలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



మిడ్ మానేరు జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

ఎల్ఎండీకి నీటి విడుదల

- మధ్యమానేరు నుంచి 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 15 టీఎంసీల వరకు నీటిని నింపే అవకాశం
- ప్రస్తుతం ఎల్ఎండీలో 5.776 టీఎంసీల నీరు

తిమ్మాపూర్, ఆగస్టు24: ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో ఎల్ఎండీలో నీటి మట్టాలు దిగువకు పడిపోయాయి. ఇటు సాగునీటితో పాటు తాగునీటికి ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చింది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.776టీఎంసీలు మాత్రమే ఉంది. శనివారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఇరిగేషన్ అధికారులు ఎగువన ఉన్న మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి ఎల్ఎండిలోకి నీటిని విడుదల చేశారు. ముందుగా రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు క్రమంగా మరో రెండు, మూడు రోజుల్లో 5-10వేల క్యూసెక్కుల వరకు పెంచే అవకాశం ఉంది. ఎంఎంఆర్ పూర్తి స్థాయి నీటి మట్టం 27.54టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.33 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎల్లంపల్లి-నందిమేడారం-గాయత్రి పంపుహౌస్‌ల నుంచి పంపుల ద్వారా ఎంఎంఆర్‌లోకి 6,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఎంఎంఆర్‌లో ప్రస్తుతానికి ఉన్న నీటి మట్టాన్ని కొనసాగిస్తూ ఎల్ఎండీలోకి నీటిని వదిలే అవకాశాలు ఉన్నాయి. ఎల్ఎండిలో కూడా 15 టీఎంసీల నీరు నింపనున్నట్లు సమాచారం. సెప్టెంబరు చివర వరకు వర్షాలు పడే అవకాశం ఉన్నందున వర్షాలకు తోడు ఎగువ నుంచి వరద నీరు, పంపు హౌస్ నుంచి ఎంఎంఆర్‌కు వస్తే అక్కడి నుంచి ఎల్ఎండీలోకి నీటిని తరలించి పూర్తి స్థాయిలో నింపుకునే అవకాశం లేకపోలేదని అధికారులు భావిస్తున్నారు. ఎల్ఎండీలో తాగునీటి అవసరాల కోసం 8టీఎంసీల నీరు నిల్వ ఉంచి మిగతా నీరు రైతుల అవసరాన్ని బట్టి సాగుకు ఇచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎంఎంఆర్ నుంచి 2వేల క్యూసెక్కులు, కాలువల ద్వారా 209క్యూసెక్కులు మొత్తం 2,209క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. గత ఏడాది ఇదే సమయంలో ఎల్ఎండిలో 20.543 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

బొమ్మకల్‌లో విద్యుత్ విజిలెన్స్ దాడులు

- అక్రమ కనెక్షన్లపై అధికారుల కొరడా
- 30 మందిపై విద్యుత్ చౌర్యం కేసు

కరీంనగర్ రూరల్, ఆగష్టు 24: ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) విజిలెన్సు అధికారులు విద్యుత్ అక్రమ కనెక్షన్లపై కొరడా ఝుళిపించారు. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్‌తో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా, వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్‌ను వినియోగిస్తున్నారనే ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు నిర్వహించింది. విజిలెన్సు డీఈ ఆదేశాల మేరకు శనివారం విజిలెన్స్ ఏడీ సంపత్‌రావు, ఏఈ మల్లేష్, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 33బై11 కేవీ సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ వైర్‌ను లాగి లక్ష్మీనగర్ వాసులు విద్యుత్‌ను ఇంటి అవసరాలకు వాడుతున్న విషయాన్ని గమనించారు. దీంతో లక్ష్మీనగర్ కాలనీకి చెందిన 23 మందిపై అలాగే ట్రినిటీ కళాశాల పక్కనే ఉన్న ఒడ్డెర కాలనీలో ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఏడీ సంపత్‌రావు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా విద్యుత్ వినియోగిస్తున్నారని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు బిగించిన విద్యుత్ వైర్‌ను తొలగించారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న వారిపై విద్యుత్ శాఖ నియమావళి ప్రకారం కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. కాలనీవాసులు విద్యుత్ శాఖ అనుమతి తీసుకుని కనెక్షన్‌లు పొందాలని సూచించారు.



బొమ్మకల్ గ్రామంలో విచారణ చేపడుతున్న విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు

తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీలు

- అనుమతులు లేని క్లినిక్‌ల మూసివేత

సుభాష్‌నగర్, ఆగస్టు 24: తెలంగాణ వైద్య మండలి సభ్యులు పలు ప్రైవేటు క్లినిక్‌లను శనివారం తనిఖీ చేసి అనుమతులు లేని వాటిని మూసివేశారు. గంగాధరలో రాము సహస్ర పేరుతో క్లినిక్ నిర్వహిస్తున్నాడని, మల్లేశం మహేశ్వర మెడికల్స్, కట్ల మల్లేశం శ్రీరామ క్లినిక్, అంజిబాబు గంగాధర మధురానగర్, కురిక్యాలలో యాదగిరి సంపత్ నిర్వహిస్తున్న క్లినిక్‌లను తనిఖీ చేశారు. కొత్తపల్లి మండలంలో రాజమౌళి క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. రఘు అనే వ్యక్తి మధు క్లినిక్ పేరుతో పలు సెంటర్లను ఓపెన్ చేసినట్లు బృందం గుర్తించింది. వారంతా అర్హత లేకున్నా వైద్యం చేస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంగాధర, కొత్తపల్లిలోని పలు క్లినిక్‌లను తనిఖీ చేసిన బృందం సభ్యులు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని వాటిని మూసివేయించారు. ఈ సందర్భంగా మండలి సభ్యుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా క్లినిక్‌లను నిర్వహించడమే కాకుండా ఎలాంటి అర్హత లేకున్నా, కేవలం పదో తరగతి చదువుకొని అల్లోపతి వైద్యం చేస్తున్నారని తాము గుర్తించామన్నారు. విచ్చలవిడిగా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్‌ను పేషంట్లకు ఇస్తున్నట్లు తమ తనిఖీల్లో వెల్లడైందన్నారు. చట్టప్రకారం అర్హతలేని వారికి ట్రైనింగ్ ఇవ్వడం, ప్రాక్టీస్ చేయడం చట్ట విరుద్ధమన్నారు. గతంలో ఓటుబ్యాంకు రాజకీయాల కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పలుమార్లు జీవోలు జారీ చేశారని ఆరోపించారు. కోర్టు ఆ జీవోలను రద్దు చేసిందని తెలిపారు. ఎన్ఎంసీ చట్టం 34, 35 ప్రకారం వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో కరీంనగర్ ఆంటి క్వాకరీ బృందం సభ్యులు హెచ్ఆర్‌డీఏ కార్యదర్శి డాక్టర్ శరణ్‌సాయి, డాక్టర్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



మందులను తనిఖీ చేస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్

యోగాతో శక్తి.. ఆధ్యాత్మిక జ్ఞానం

- యోగాతో అనంత ప్రతిభను సొంతం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- జిల్లా స్థాయి యోగా పోటీలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 24: మన పూర్వీకులు అందించిన వారసత్వ సంపద యోగాతో కేవలం ఆధ్యాత్మిక జ్ఞానమే కాకుండా సార్వత్రిక శక్తి అలవర్చుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల ప్రారంభోత్సవానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయసుకు అనుగుణంగా ఇష్టమైన క్రీడల్లో పాల్గొనడం, యోగా చేయడం తప్పనిసరి అన్నారు. 30 ఏళ్ల వయసు వచ్చే వరకు జీవితంలో ఏమి చేయలేదో, ఏమి చేయాలో యోగా చెబుతుందని అన్నారు. పాఠశాలలు, పిల్లలు యోగాతో అనంత ప్రతిభ స్వంతం చేసుకోవాలని సూచించారు. కారాగారాల్లో ఉండే ఖైదీలలో కూడా యోగాతో మానసిక పరివర్తన కలుగుతుందని అన్నారు. కేవలం క్రీడలనే సహ పాఠ్యాంశాలని ప్రధానంగా ఏర్పడిన కరీంనగర్ ప్రాంతీయ పాఠశాలలో 2006 నుంచి ఇప్పటి వరకు ఒక్క విద్యార్థి ఫెయిల్ కాలేదని అన్నారు. చిన్నారులు ప్రదర్శించిన యోగాసనాలు వారి ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభకనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని కలెక్టర్ చిన్నారులకు ఉద్బోధించారు. జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సర్దార్ రవీందర్‌సింగ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం నుంచి జిల్లా ఛాంపియన్‌గా నిలిచిన గొప్ప చరిత్ర కరీంనగర్‌కు ఉందని చెప్పారు. ఆ స్ఫూర్తిని 20 ఏళ్లగా క్రీడాకారులు కొనసాగించేలా విశేషంగా కృషిచేస్తున్న ఘనత అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిద్దారెడ్డిదని కొనియాడారు. అనంతరం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడలు, యువజన అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిద్దారెడ్డి, తెలంగాణ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.జనార్ధన్‌రెడ్డి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి టి.రమేశ్‌రెడ్డి, డీఈవో కార్యాలయం సూపరింటెండెంట్ ఎం.నర్సింహస్వామి, జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్, యోగా కోచ్‌లు సంపత్‌కుమార్, కిష్టయ్య, రామకృష్ణ, మల్లేశ్వరీ, అశోక్, కోటేశ్వర్‌రావు, ప్రవీణ, స్వరూపచారి, వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్.నర్సయ్య, పి.శ్రీనివాస్, సత్యానంద్, సూర్యప్రకాశ్, స్నేహలత, హరిప్రసాద్, సహ క్రీడాకారులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి



ఆన్‌లైన్‌లో పంటల సాగు వివరాలు

- ప్రత్యేక యాప్‌లో నమోదు

కరీంనగర్ రూరల్, ఆగష్టు 24: గ్రామాల్లో పంటల సాగు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మండల వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట సాగు వివరాలను నమోదు చేస్తున్నారు. దీంతో మండలంలో ఎంత పంట, ఏఏ పంటలు పండిస్తున్నారు. వాటికి కావలసిన ఎరువు లు, రైతులకు బీమా సౌకర్యం లాంటి వివరాలు తెలిసే అవకాశం ఉంది. కరీంనగర్ మండలంలో వరి పంటను సాగు చేసేందుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపారు. రెండో పంటగా పత్తి పంటను ఎక్కువ సాగు చేశారు. పంటల సాగు ప్రక్రియను అధికారులు ఈ నెల 15 వరకు పూర్తి చేయాల్సి ఉండగా రైతులు వరినాట్లు ఆలస్యం కావడంతో ఈ ప్రక్రియను ప్రభుత్వం గడువును పొడగించింది. దీంతో ఈ నెల చివరి వరకు పంట సాగు నమోదు ప్రక్రియ కొనసాగనుంది.

పంటల సాగు వివరాల సేకరణకు ఏఈవోలకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను కేటాయించి తెలంగాణ భూనక్షా (కడస్ట్రాల్ మ్యాప్)ను యాప్‌తో లింక్ చేశారు. ఇప్పటికే శాటిలైట్ సాంకేతికతతో అక్షాంశాలు, రేఖాంశాల ఆధారిత చిత్రపటాలను ధరణిలో వినియోగిస్తుండగా దీంతో పాటు పంటల సాగు వివరాలు నమోదు చేపట్టారు. ఏఈవోలు రైతు పొలం దగ్గరికి పోయిన తర్వాత భూనక్షా మ్యాప్‌ను ఆన్ చేయగానే ఆ ప్రాంత్రం 50మీటర్ల పరిధిలోని సర్వే నెంబర్లు కనిపిస్తాయి. రైతు పేరు, విస్తీర్ణం, ఆధార్ కార్డు, గ్రామం, గతంలో సాగు, ప్రస్తుతం సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. సాగు చేసిన పంటల వివరాలు యాప్‌లో నమోదు చేసి పంట ఫొటోను సైతం అప్‌లోడ్ చేస్తున్నారు.

ప్రభుత్వం భూనక్షా యాప్‌లో పంట సాగు వివరాలను నమోదు చేయడం వల్ల రైతులకు లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి సత్యం తెలిపారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాల అవసరం, రైతు బీమా వంటి పథకాలు అమలు చేసేందుకు ఈ సర్వే తోడ్పడుతుందని తెలిపారు.





పంట సాగు సర్వే చేస్తున్న మండల విస్తరణ అధికారులు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి
చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, ఆగస్టు 24: శంకరపట్నం మండలం వంకాయగూడెం శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంకాయగూడెంకు చెందిన చల్ల కనకయ్య (58) శుక్రవారం తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్లేందుకు ఇంట్లో నుంచి బయటకు వచ్చి రోడ్డుపైన వెళ్తున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో రోడ్డుపై పడి ఉన్న కనకయ్యను చూసిన స్థానికులు మృతుడి భార్య మధనవ్వకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు కనకయ్యను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కనకయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

ఆధునిక కాలంలో
జంతుశాస్త్ర పురోగతి అవసరం



ప్రొఫెసర్ రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమేశ్

జమ్మికుంట, ఆగస్టు 24: ఆధునిక కాలంలో జంతుశాస్త్ర పురోగతి ఎంతో అవసరం ఉందని ఉస్మానియా విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జంతుశాస్త్రంలో ఇటీవలి పురోగతులు అనే అంశంపై ఒక రోజు సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ మట్లాడుతూ మానవ మనుగడపై విద్యార్థులు జంతుశాస్త్ర అభివృద్ధికి వినూత్నమైన పరిశోధనలు చేయాలని సూచించారు. మానవళి అభ్యున్నతి జంతుశాస్త్ర పురోగతితో ముడిపడి ఉందన్నారు. ఆధునిక కాలంలో రోజు రోజుకు పెరుగుతున్న క్యాన్సర్ వ్యాధి కారకాలు, వాటి నివారణ, తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రిన్సిపాల్ బి రమేశ్‌ప్రొఫెసర్ రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేశ్, జంతుశాస్త్ర విభాగాధిపతి కె గణేశ్, కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కే రాజేంద్రం, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ ఓదేలు కుమార్, జంతుశాస్త్ర అధ్యాపకులు మమత, రమేశ్, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సైదాపూర్, ఆగస్టు 24: సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లి గ్రామ స్టేజీ వద్ద ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. పీడీఎస్ బియ్యం తరలిస్తున్న దిరావత్ పాండు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి, ట్రాలీని సీజ్ చేశామని తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



నృసింహుడిని దర్శించుకుంటున్న భక్తులు

నృసింహుడి సన్నిధిలో శ్రావణ భక్తుల రద్దీ

ధర్మపురి, ఆగస్టు 24: ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు శ్రావణ మాసం మూడవ శని వారం భక్తులతో రద్దీగా అగుపించాయి. ఉద యం వేళలో ఆలయ వేదపం డితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితక వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు వివిధ రకాల పూజల టిక్కె ట్లు కొనుగోలు చేశారు. అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందిం చారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, ఆగస్టు 24: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తుల తో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కు లు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగ కుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య పర్యవేక్షకులు హరిహర నాథ్, చంద్రశేఖర్, సునీల్ ఇతరఅధికారులు పర్యవేక్షించారు. ఆంజనేయస్వామిని జిల్లా పౌరస రఫరాల అధికారి జితేందర్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు.



కొండగట్టులో పూజలు చేస్తున్న భక్తులు

అవినీతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వ పాలన

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

ముస్తాబాద్, ఆగస్టు 24: అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చేలా పాలన కొనసాగిస్తోందన్నారు. గతంలో అవినీతి అక్రమాలతో ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టి అస్తవ్యస్తంగా పనులు చేయడంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు.. గతంలో పనులు చేతకాక కేటీఆర్, హరీష్‌రావు అవినీతి అక్రమాలకు పాల్పడ్డార న్నారు. ఇప్పుడు పనులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కుటుంబ పాలనతో ప్రజలను ఎన్నో ఇబ్బం దులకు గురిచేశారన్నారు. దీంతో ప్రజలే ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. ఓవైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాళేశ్వరం ప్రాజెక్టుకు వెళ్లడం ఒక డ్రామా అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి రెండు లక్షల రైతు రుణమాఫీ చేసి రైతులకు ఇచ్చిన మాటను నిలబె ట్టుకున్నారన్నారు. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు మతి లేని మాటలు మాట్లాడడం ప్రజలు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న కటకం మృత్యుంజయం

చేస్తున్న పనులకు అడ్డం పడుతూ సమయాన్ని వృథా చేయడం బీఆర్ఎస్ మానుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజల సమస్యలను ప్రభు త్వానికి విన్నవిం చడం గౌరవప్రదమని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, నాయకులు తాళ్ల విజయ్ రెడ్డి, దీటి నర్సింలు, ముచ్చర్ల శ్రీని వాస్, తలారి నర్సింలు, భాను, గంత రాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


రాజన్న ఆలయంలోని వివిధ విభాగాల్లో అవకతవకలు

- రెండు రోజుల పాటు ఏసీబీ అధికారుల తనిఖీలు - ఉన్నతాధికారులకు నివేదిక సమర్పణ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24: వేముల వాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో పలు విభాగాల్లో అవకతవకలు బయటపడ్డాయి. రెం డు రోజులపాటు ఆలయంలోని పలు విభాగాల్లో క్షుణ్ణంగా పరిశీలించిన ఏసీబీ అధికారులు పలు అవకతవకలు గుర్తించి ఉన్నత స్థాయి అధికా రులకు శనివారం నివేదికను అందించారు. ఏసీబీ తెలంగాణ పేరుతో అధికారులు ఎక్స్‌లో అవకతవకలతో కూడిన పోస్టును విడుదల చేశారు. రాజన్న ఆలయంలోని లడ్డూల త యారీ విభాగంలోని స్టాక్ రిజిస్టర్‌లో తేడాలు ఉండటం గుర్తించారు. నెయ్యి, జీడిపప్పు, నూనే సంబంధిత వాటిలో తేడాలు బయటపడ్డాయి. తలనీలాలు సమర్పించ డం కోసం వచ్చే భక్తుల నుంచి కల్యా ణకట్ట వద్ద రూ. 50 నుంచి రూ. 100 వసూలు చేయడం, నూతన టెండర్లకు కమిష నర్, దేవాదాయ శాఖ ఆమోదం లేకుండానే పాత టెండర్ల ప్రకారం వస్తువులను కొనుగోలు చేయడం వంటి అవకతవకలు బయటపడ్డాయి.

● ఆలయ ఉద్యోగుల్లో ఆందోళన..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆల యంలో గురువారం, శుక్రవారం ఏసీబీ అధి కారులు సోదాలు నిర్వహించారు. రెండు రోజులపాటు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో పలు విభాగాల్లోని ఫైళ్లను సీజ్ చేసి తీసుకువెళ్లారు. ఏసీబీ అధికా రులు పలు విభాగాల్లో అవకతవకలు ఉన్నట్లు ఉన్నతాధికారులకు నివేదికను అందజేశారు. దీంతో సంబంధిత విభాగాల ఉద్యోగులు ఇరుక్కున్నామని భయాందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.


← Post
ACB Telangana
@TelanganaACB
#ACBOfficials conducted Surprise Check at Sri Raja Rajeshwara Temple, Vemulawada of Rajanna Sircilla District and the EO Office on 22.08.2024. (Yesterday)
The following irregularities were identified.
1) Variations in the stock register (related to Ghee, Cashew nut and Oil)
2) Collecting Rs.50/- / 100/- per rach piligrim for head tonsuring at Kalyanakatta.
3) Without approval of tenders by the Commissioner, Endowment dept for the process of items (Maximum) purchasing. But they are following old tenders.
#AntiCorruptionBureau #Telanagana #Justice @CVAnandIPS

ఏసీబీ తెలంగాణ పేజీలో వైరల్‌గా మారిన అవకతవకల పోస్ట్

సౌదీలో యువకుడి మృతి

- కరీంనగర్‌లో విషాదం



షహెదా ఖాన్(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24: కరీంనగర్ ఆదర్శనగర్‌కు చెందిన ఎండీ షహెదా ఖాన్(27) సౌదీ అరేబి యాలో నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు సమాచా రం అందడంతో మృతుడి ఇంట విషాదం నెలకొంది. కరీంన గర్ ఆదర్శనగర్‌కు చెందిన ఎండీ షహెదాఖాన్ ఏడు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లి అక్కడ ఒక సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏడాదికి ఒకసారి స్వదేశా నికి వచ్చి వెళ్లేవాడు. ఆదర్శనగర్‌కు చెందిన షహెదాఖాన్ తండ్రి స్వస్థలం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, తల్లిది కరీంనగర్. షహెదాఖాన్ కరీంనగర్‌కు చెందిన మహిళను వివాహం చేసుకుని ఇక్కడే ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్నాడు. వారికి రెండు సంవత్సరాలు, 8 నెలల ఇద్దరు పిల్లలు న్నారు. ఏడాది కిందటే షహెదాఖాన్ కరీంనగర్‌కు వచ్చి కొన్నిరోజులు భార్యపిల్లలు, కుటుంబ సభ్యులతో గడిపి తిరిగి సౌదీ అరేబియాకు వెళ్లాడు. షహెదాఖాన్ మరణించాడని తెలిసిందని, కానీ సౌదీ అరేబియా నుంచి అధికారికంగా పూర్తి సమాచారం అందలేదని మృతుడి బంధువులు వెల్లడించారు. సౌదీఅరేబియాలో శుక్రవారం నుంచి మూడు రోజులు సెలవుదినాలు కావడంతో మృత దేహం పంచనామా, పోస్టుమార్టం పూర్తి అయి స్వదేశానికి చేరేందుకు వారం పది రోజులు పట్టే అవకాశముందని మృతుడి బంధువులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గొల్లపల్లి, ఆగస్టు 24: గొల్లపల్లి మండలం గుంజప డుగు గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేసి శనివారం పట్టుకున్నారు. డీటీ శ్రీని వాస్, పౌరసరఫ రాల శాఖ ఇన్స్‌పెక్టర్ స్వామి ఆధ్వర్యంలో పక్కా సమా చారం మేరకు గ్రామంలో పస్తం కనకయ్యకు చెం దిన షెడ్డులో అధికారులు సోదాలు చేయగా 11 క్వింటాళ్ల విలువైన 20 బస్తాల పీడీ ఎస్ రైస్ పట్టుబడింది. వాటిని స్వాధీనం చేసుకుని గోదాంకు తరలించారు. కనకయ్యను అదుపులోకి తీసుకుని, అతడి పై సెక్షన్ 6-ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వీణవంక: మండలంలోని ఘన్ముక్ల గ్రామంలో పోలీసు లు పెట్రోలింగ్ చేస్తుండగా రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండుగా పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. సు ల్తానాబాద్‌కు చెందిన బోనగిరి సురేష్ పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ బలవన్మరణం

గొల్లపల్లి, ఆగస్టు 24: మండలంలోని వెన్గుమట్ల గ్రామంలో శనివారం తీరని విషాదం నెలకొంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఓ ఆటోడ్రైవర్ రెండు నెలల క్రితం నెలల తక్కువతో జన్మించిన తన చిన్నారికి మెరుగైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక జీవితం మీద విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పొన్నం వెంకటేష్ (28) అనే నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు గ్రామంలో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. వెంకటేష్‌కు రెండేళ్ల క్రితం వివాహం జరగగా రెండు నెలల క్రితం ఓ ఆడ శిశువు జన్మించింది. చిన్నారి పుట్టిన నాటి నుంచి అనారోగ్యంతో బాధపడుతుండడతో ప్రైవేట్ అనుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఇప్పటికే చిన్నారి వైద్య ఖర్చుల కోసం బంధుమిత్రులు, తెలి సిన వాళ్ల దగ్గర అప్పులు చేసి సుమారు రూ. 4 లక్షల మేర వెచ్చించారు. అయినా చిన్నారి జబ్బు నయం కాకపోగా మరింత ముది రింది. దీనికి వైద్యులు చిన్నారి ప్రాణాపాయం నుంచి బయటపడాలంటే మెరుగైన వైద్యం చేయించాలని, అందుకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని తల్లిదం డ్రులకు తెలిపారు. దీంతో వెంకటేష్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. బిడ్డకు మెరుగైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక జీవితం మీద విరక్తి చెంది శనివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు.

మహిళలకు లోన్‌యాప్ వేధింపులు

గంగాధర, ఆగస్టు 24: మండలంలో పలువురి మహిళలకు లోన్‌యాప్ సిబ్బంది ఫోన్ చేసి వేధింపులకు గురి చేస్తున్నారు. తాను లోన్ తీసుకోకున్న ఆన్‌లైన్‌లో రుణం పొందిన వ్యక్తికి సాక్షి సంతకం చేయగా రుణం తిరిగి చెల్లించక పోవడంతో సాక్షి సంతకం చేసిన వ్యక్తి మహిళ బంధువులతో పాటు ఆ గ్రామ మహిళా మాజీ సర్పంచ్ భర్తను లోన్‌యాప్ సిబ్బంది అసభ్య కరంగా మాట్లాడుతూ వేధింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ యువకుడు ఆన్‌లైన్‌లో లోన్‌యాప్‌లో రుణం తీసుకున్నాడు. రుణం తీసుకున్న స్నేహితుడికి గంగాధర మండలంలోని యువకుడు ఆన్‌లైన్‌లో సాక్షి సంతకంతో పాటు ఫోన్ నంబర్ జతచేశాడు. రుణం తీసుకున్న యువకుడు సకాలంలో చెల్లించలేదు. దీంతో సాక్షి సంతకం పెట్టిన మండలంలోని యువకుడి మొబైల్‌లోని కాంటాక్టు నంబర్లను సేకరించి మహిళలకు సంస్థ నుంచి పలుమార్లు ఫోన్ చేసి వేధింపులకు గురి చేశారు. సదరు వ్యక్తి తమకు తెలి యదని సమాధానం చెప్పినా రుణం ఇచ్చిన వారు అసభ్యకరంగా మహిళ భర్తతో పాటు మరో పది మంది మహిళలతో మాట్లాడినట్లు తెలిపారు.

అదుపుతప్పి పొలంలో పడ్డ కారు

- మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు తప్పిన ప్రాణాపాయం

జగిత్యాలరూరల్, ఆగస్టు 24 : జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు వెళ్లే రహదారి లో శనివారం ఉదయం కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. శనివారం ఉదయం కారులో కరీంనగర్ నుంచి జగిత్యాల మీదుగా కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు కారులో ఐదుగురు ఉపాధ్యాయులు వస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రహదారి బురదమయమై పూర్తిగా దెబ్బతింది. ఈ క్రమంలో పాఠశాలకు వెళ్లే రహదారి మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లడంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈసంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయులకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు. పొలంలో పడ్డకారును ఉపాధ్యాయులు, స్థానికులతో కలిసి బయటకు తీశారు.

పెద్దపల్లి లైబ్రరీకి పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేత



మాట్లాడుతున్న డాక్టర్ బీఎస్ రావు

పెద్దపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షల కోసం పోటీ పడే నిరుద్యోగ యువతీ యువకుల కోసం కావాల్సిన స్టడీ మెటీరియల్‌ను క రీంనగర్‌లోని బీఎస్ రావు ఫౌండేషన్ వ్యవ స్థాపకుడు డాక్టర్ బీఎ స్‌రావు లైబ్రరీకి అంద జేశారు. శనివారం పెద్దపల్లి లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో స్కిల్స్ కొరత కారణంగా దేశంలో పదకొండు కోట్ల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయ న్నారు. స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు స్థాపిస్తే అభివృద్ధితో పాటు ఉపాధి కల్పన పెరుగుతుం దన్నారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ డాక్టర్ బీఎస్‌రావు ఎప్పటినుంచో పేదలకు ఉచిత వైద్య సేవలం దిస్తున్నారన్నారు. గత సంవత్సరం నుంచి విద్యాపరంగా నాలుగు జిల్లాల్లో పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకి ఇస్తున్నారు తెలిపారు. ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ఫణీందర్, అడ్వకేట్ ఆడెపు దినేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పెరిగిన వరద

- కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు పెరుగుతున్నది. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 23,094 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 16,564 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 6,530 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. నంది పంప్‌హౌస్ నుంచి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడడంతో వరద నీరు ఎక్కువగా వస్తున్నది. ప్రాజెక్టు నిండడంతో గేట్లు ఎత్తి గోదావరిలోకి వదులుతున్నారు. ఆ నీరంతా శ్రీపాద ఎల్లంపల్లికి చేరుతున్నది. మరింత వరద పెరిగితే మాత్రం నంది పంప్‌హౌస్‌లో మరో రెండు మోటార్లు ఆన్ చేసి 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని భావిస్తున్నామని నీటి పారుదల శాఖాధికారులు పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.529 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతుంది. శనివారం రెండు పంపుల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 18.5 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

ఎల్ఎండీకి నీటి విడుదల ప్రారంభం

బోయినపల్లి, ఆగస్టు 24: మిడ్ మానేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగు తుండడంతో ఎల్ఎండీలోకి నీటి విడుదలను శనివారం ప్రారంభించారు. మిడ్ మానేరులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6300, ములవాగు మానేరు వాగు ద్వారా 700 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 313.99 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.33 టీఎంసీల మేరకు చేరుకొంది. కాగా ఎల్ఎండీ ప్రాజెక్ట్‌కు రెండు వేల క్యూసెక్కుల నీటి విడుదలను ప్రాంభించారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం ఇన్‌ఫ్లో పెరిగింది. ఎస్సారెస్పీలోకి 29,443 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 51.659 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అసరాలకు ప్రాజెక్టు నుంచి 3,822 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అంతరాలయ దర్శన టికెట్ల పునరుద్ధరణ



అంజన్న ఆలయం

మల్యాల, ఆగస్టు 24: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో కొన్నాళ్ల క్రితం కొవిడ్-19 నేపథ్యంలో నిలిచిపోయిన అంతరాలయ దర్శన టికెట్లను పునరుద్ధరిస్తున్నట్లు ఈవో రామకృష్ణారావు తెలిపారు. కొవిడ్‌కు ముందు రూ.400 టికెట్ అంతరాలయ దర్శ నంలో భాగంగా సంప్రదాయ దుస్తులతో అయిదుగురికి దర్శనం కల్పించగా కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో 16 మార్చి 2020 నుంచి అంతరాలయ దర్శనాలు నిలిపివేశారు. శనివారం నుంచి మళ్లీ యదావిధిగా రూ.400టికెట్‌తో అంతరాలయ దర్శనాలు పునరుద్ధరిం చినట్లు భక్తులు సహకరించాలని ఈవో పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం

- ఉన్నత ఉద్యోగం సాధించినా రిలీవ్ చేయడం లేదని ఆవేదన - మండలపరిషత్ కార్యాలయంలోనే ఘటన



చికిత్సపొందుతున్న శ్రీనివాస్

ఇల్లంతకుంట, ఆగస్టు 24: ఉన్నతస్థాయి ఉద్యోగం సాధిం చినా మండలపరిషత్ అధికా రులు రిలీవ్ చేయడం లేదంటూ రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంత కుంట మండలం కిష్టరావుపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి లంబాడి శ్రీనివాస్ మండల పరి షత్ కార్యాలయంలో శనివారం క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. తోటి పంచాయతీ కార్య దర్శుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా హవేలీఘన్‌పూర్ మండలం పర్దీన్‌పూర్ గ్రామానికి శ్రీనివాస్ నారాయణఖేడ్ మండలం అంత్వార్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన 317 జీవోతో ఇల్లంత కుంట మండలం కిష్టరావుపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యాడు. ఇల్లంతకుంటలో తోటి పంచాయతీ కార్యదర్శులతో ఉంటూ శ్రీనివాస్ పోటీపరీక్ష లకు సిద్ధం అవుతూనే విధులు నిర్వహించే వాడు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించి న ఫలితాల్లో మెదక్ మున్సిపాలిటీలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 31లోపు విధుల్లో చేరవలసి ఉంది. తనను పంచాయతీ కార్యదర్శి నుంచి రిలీవ్ చేయాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. అయినా ఆలస్యం జరుగుతుండటంతో శనివారం మండలపరిషత్ కార్యాలయా నికి చేరుకొని ఎంపీడీవోకు సమస్యను విన్నవించాడు. వెంటనే పక్కన ఉన్న గది లోకి వెళ్లి వెంటతెచ్చుకున్న క్రిమిసంహారక మందుతాగి అపస్మారకస్థితికి చేరుకు న్నాడు. ఇల్లంతకుంటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రథమ చికిత్స జరిపి ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. తొమ్మిది ఉద్యోగాలు సాధించాడని గతంలో ఇదే మండలపరిషత్ కార్యాలయంలో సన్మానం పొందిన శ్రీనివాస్‌ను అపస్మారకస్థితిలో తరలించడాన్ని మండలపరిషత్ సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. సంఘటనపై ఎంపీడీవో శశికళను వివరణ కోరగా రెండు రోజుల క్రితమే తమకు లేఖ అందిందని, ఎంపీవో నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోవాలని సూచించానని తెలిపారు. తొందరపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, తాము ఎక్కడా ఆలస్యం చేయలేదని వివరించారు.

- అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24: విధుల్లో పట్ల అంకితభావంతో పని చేస్తున్న ఉద్యోగికి మరో ఉద్యోగం రావడంతో రిలీవ్ చేయడంలో మానసికంగా వేధింపు లకు పాల్పడిన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్య క్షుడు తోట ఆగయ్య, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు డిమాండ్ చేశారు. అధికారుల తీరుతో మనస్తాపానికి గురై ఇల్లంతకుంట మండల పరిషత్తు కా ర్యాలయంలో పురుగుల మందు తాగిన కిష్టరావుపల్లి పంచాయతీ కార్యదర్శి లంబాడి శ్రీనివాస్‌ను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుప త్రిలో శనివారం వారు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శిగా పనులు చేస్తూనే ఉన్నత ఉద్యోగం సాధించిన శ్రీనివాస్‌ను మండల పరిషత్ అధికారులు విధుల నుంచి రిలీవ్ చేయకపోవడం వల్లే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. ఆయనకు మెరు గైన వైద్యం అందించడంతో పాటు వేధింపులకు గురిచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన కుటుంబంలో జన్మించిన శ్రీనివాస్ ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత ఉద్యోగం సాధిస్తే రిలీవ్ చేయాల్సిన అధికా రులు ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేశ్‌నాయక్ అన్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తిరుపతినాయక్ తదితరులు ఉన్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

ధర్మపురి, 24 :ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో సట్టంశెట్టి రజని (39) అనే వివాహిత శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆమె దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోరుట్ల రూరల్, ఆగస్టు 24 : మండలంలోని వివిధ గ్రామాల నుంచి కో రుట్ల పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నట్లు తహసీల్దార్ కిషన్ శనివారం తెలిపారు. మండలం లోని వివిధ గ్రామాలలో రెవెన్యూ అధికారులతో దురుసుగా ప్రవర్తించిన వారిపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఆర్ఐ రాజేందర్‌రావు ఇచ్చిన పిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజుల నుంచి అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న 22 ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 15 మందికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24: మద్యం సేవించి వాహ నాలు నడపుతూ ఇటీవల కరీంనగర్‌లో పట్టుబడిన 15మంది వాహనదారులకు కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 70మందిని ట్రాఫిక్ పోలీసులు శనివారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇందులో ఐదుగురికి 7 రోజులు, 10 మందికి 3 రోజులు జైలు శిక్ష, మొత్తం 34 వేల జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు. మిగతా 55మందికి 90 వేల 500 రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 223 వాహనదారులకు జైలు శిక్షలు పడ్డాయని సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24: కరీంనగర్ కోర్టు సమీపం లోని వాటర్‌ట్యాంక్ పక్కన గుర్తుతెలియని వృద్ధురాలు(65) మృతిచెందిందని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. శని వారం రాత్రి 9గంటల సమయంలో వృద్ధు రాలు పడిపో యి ఉండగా గుర్తించిన పోలీసులు ఆమెను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదికి తరలించి భద్రప రిచినట్లు తెలిపారు. వృద్ధురాలిని గుర్తించి నవారు రెండో ఠాణా పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, ఆగస్టు 24: మండలంలోని మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన బోయిని సదానందం (45)పు రుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం ఇంటి బయట పురుగుల మందు తాగగా గుర్తించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించినట్లు స్థానికులు తెలిపారు. సదా నందం సిరిసిల్ల మార్కెట్‌లో రైతుల వద్ద కూరగాయలు కొనుగోలు చేసి విక్రయించేవాడు. పది రోజులుగా మార్కెట్‌కు సైతం వెళ్లడం లేదని బంధువులు చెప్తు న్నారు. ప్రస్తుతం సదానందం పరిస్థితి విషమంగా ఉంది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- సెస్ రిటైర్డ్ లైన్‌మెన్ మృతి



ధర్మారంలో బైకును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

కోనరావుపేట ఆగస్టు 24: మండలంలోని ధర్మారం గ్రామ శివారులో బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టగా సెస్ రిటైర్డ్ లైన్‌మెన్ శని వారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సంజీవ్‌నగర్‌కు చెందిన ఆర్ వెంకట్రాజం (63) అనే వ్యక్తి గతంలో లైన్‌మెన్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. ప్రస్తుతం కోనరావుపేట మండల మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచే స్తున్నాడు. శనివారం విధులు ము గించుకొని బైక్‌పై ఇంటికి వెళుతుం డగా ధర్మారం గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో కింద పడిపోయిన వెంకట్రాజముకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఆసుపత్రి తరలించారు. అనుపత్రిలో శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

రాజన్న సేవలో బీసీ కమిషన్ సభ్యుడు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్‌గౌడ్ శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయా నికి విచ్చేసిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు. సూపరింటెండెంట్ తిరుపతిరావు, పీఆర్వో అశోక్ ప్రసాదం అందజేశారు.



స్వాగతం పలుకుతున్న సూపరింటెండెంట్ తిరుపతిరావు

విద్యాసంస్థల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు





కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న సెయింట్‌జార్జ్ విద్యార్థులు, పారమితలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు, అచీవర్స్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

కరీంనగర్ కల్చరల్/భగత్‌నగర్, ఆగస్టు 24: నగరంలోని పలు విద్యా సంస్థల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోతిరాంపూర్‌లోని అచీవర్స్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో డైరెక్టర్ సీహెచ్ వేంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు.

●కోరా జాన్సన్ స్కూల్లో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాదరెడ్డి, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

●సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్, అతిథిగా హాజరైన సరస్వతీ విద్యా పీఠం పాలకమండలి సభ్యుడు ఎలగందుల సత్యనారాయణ, పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి, రాచమల్ల భద్రయ్య, స్కూల్ హెచ్‌ఎం సముద్రాల రాజమౌళి పాల్గొన్నారు.

●హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జంగ సునీతా మనోహర్‌రెడ్డి వేడుకలను ప్రారంభించారు. అనంతరం శ్రీకృష్ణుని జీవిత చరిత్రను, అవతార పరమార్థాన్ని విద్యార్థులకు వివరించారు.

●నగరంలోని సిద్ధార్థ విద్యాసంస్థల్లో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో చైర్మన్ శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

●భగత్‌నగర్‌లోని రావూస్ టెక్నో స్కూల్లో జరిగిన వేడుకల్లో చైర్మన్ ప్రభాకర్‌రావు, సీఈఓ నిధిన్‌రావు, ప్రిన్సిపాల్ రహమాన్ పాల్గొన్నారు.

●పారమిత విద్యాసంస్థల్లో జరిగిన వేడుకల్లో చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు అనూకర్‌రావు, వియుఎం ప్రసాద్, రమణ, వినోద్‌రావు, హనుమంతరావు పాల్గొన్నారు.

●**భగత్‌నగర్:** నగరంలోని సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ (సిబిఎస్‌ఈ), ప్యారడైజ్ పాఠశాలల్లో వేడుకలను చైర్మన్ ఫాతిమారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అకాడమిక్ సీఈఓ ఉమాకాంత్, ప్రిన్సిపాల్ వసంత, వైస్ ప్రిన్సిపాల్ మధు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** పట్టణ శివారులోని ఏకశిల పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ దినేష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నరేష్ పాల్గొన్నారు.

●**హుజూరాబాద్‌రూరల్:**సింగాపూర్ గ్రామంలోని వీఎస్‌ఆర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శనిగరం రజిత పాల్గొన్నారు.

●**జమ్మికుంట:** పట్టణంలోని కాకతీయ విద్యా సంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ ఆవిర్నేని సుధాకర్‌రావు పాల్గొన్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గార్డియన్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు.

●**ఇల్లందకుంట:** మండలంలోని సీతంపేట ప్రభుత్వ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

●**సైదాపూర్:** మండల కేంద్రంలోని కేరళ ఇంగ్లీస్ మీడియంస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతి పాల్గొన్నారు.

●**మానకొండూర్:** మానకొండూర్‌లోని గుడ్‌న్యూస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

●**చొప్పదండి:** పట్టణంలోని సిద్ధార్థ, కృష్ణవేణి, గీర్వాణి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

●**గంగాధర:** మండలంలోని వివేకానంద విద్యాలయం, సురభీ కాన్వెంట్, సాయి విన్నర్స్ ఎడ్జ్ హైస్కూల్, నరేంద్ర విద్యాలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**గన్నేరువరం:** మండల కేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో కరస్పాండెంట్ బూర వెంకటేశ్వర్, ప్రిన్సిపాల్ భానుచైతన్య పాల్గొన్నారు.





సిద్ధార్థ పాఠశాలలో వివిధ వేషధారణలో విద్యార్థులు, కోరాజాన్సన్ స్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు, బ్లూబెల్స్ స్కూల్‌లో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

ఆర్‌ఎంపీల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 24 : జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కరీంనగర్ ఆర్‌ఎంపీ వైద్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముస్తాక్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీలు శనివారం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని మినిష్టర్స్ క్వార్టర్స్‌లోని మంత్రి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వీధికుక్కల బెడద నుంచి రక్షించండి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 24: నగరంలో ఎక్కడ చూసినా వీధికుక్కలు స్వైర విహారం చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయని వీధికుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను డిసిసి ట్రేడ్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలగందుల మల్లేశం ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే నగరంలో పారిశుధ్య పనులు సరిగా నిర్వహించకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి పోయాయని, దీనితో వైరల్, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు నగర ప్రజలను పట్టి పీడిస్తున్నాయని, దోమల నివారణ చర్యలతోపాటు పారిశుధ్య పనులను మరింత మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అమీర్, పొన్నం మధు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'సహజ వనరులను పొదుపుగా వాడుకోవాలి'



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 24: సహజ వనరులను పొదుపుగా వాడుకోవాలని జిల్లా విద్యాధికారి సిహెచ్‌విఎస్ జనార్దన్‌రావు అన్నారు. శనివారం స్థానిక వాణినికేతన్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్లు, వర్మీ కంపోస్టు తయారుపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి సిహెచ్‌విఎస్ జనార్దన్‌రావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఎస్‌జీసీ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న హ్యాండ్సన్ ప్రాక్టీస్ చేయడం ద్వారా నేర్చుకోవడం అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులతో ప్రత్యక్షంగా వారితో ఎల్‌ఈడీ లైట్లు తయారు చేయించడం బయో కంపోస్టు ఏ విధంగా తయారు చేయడం అనేది చాలా చక్కగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఇక్కడ నేర్చుకున్న వాటిని మీ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ నేర్పించాలన్నారు. రాబోయే కాలంలో శక్తి వనరులను పొదుపుగా వాడి సహజ వనరులను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రథమ కర్తవ్యమని, ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఈసందర్భంగా జిల్లా విద్యాధికారి సిహెచ్‌విఎస్ జనార్దన్‌రావు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు జిల్లా సైన్స్ ఆఫీసర్ చాడ జైపాల్‌రెడ్డి, అకాడమిక్ మానిటర్ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, రాష్ట్ర ఎస్‌జీసీ కో ఆర్డినేటర్ బి.విద్యాసాగర్, వాణినికేతన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మారెడ్డి, టిబిఎస్‌ఎఫ్ రాష్ట్ర బాధ్యులు వి.ఆంజనేయులు, ఎఫ్‌పిఎస్‌టి కో ఆర్డినేటర్ బి.ఓదెలుకుమార్, రిసోర్స్‌పర్సన్ భుజన్ చందర్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్వల ప్రాజెక్ట్‌కు మరమ్మతులు చేపట్టాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



దీక్ష చేపడుతున్న బీజేపీ నాయకులు

వీణవంక, ఆగస్టు 24: కల్వల ప్రాజెక్ట్‌కు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్వల ప్రాజెక్ట్ ద్వార శంకరపట్నం, వీణవంక మండలా పరిధిలో ఏనిమిది వేల ఏకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. రెండేళ్ల క్రితం గండి పడిందన్నారు. అప్పటి నుంచి పాలకులు పట్టించుకోక పోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే మరమ్మతులు చేపట్టి ఆయ కట్టు రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, నాయకులు చెన్న మాధవుని నర్సింహరాజు, బత్తిని నరేష్‌గౌడ్, ముదిగంటి విద్యాసాగర్‌రెడ్డి, పుప్పాల రఘు, మద్దురి సమ్మిరెడ్డి, పత్తి దేవేందర్‌రెడ్డి, బొబ్బల విజయ్‌రెడ్డి, ఎర్రబెల్లి సంపత్‌రావు, మల్లేష్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొలంగూర్ గ్రామ విభజన వద్దు

శంకరపట్నం, ఆగస్టు 24: మొలంగూర్ గ్రామాన్ని మూడు గ్రామపంచాయతీలుగా విభజించవద్దంటూ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నేరేళ్ల సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో మండల సూపరింటెండెంట్ రాఘవేంద్రరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బండి రమేష్‌బాబులకు కార్యకర్తలతో కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ మొలంగూర్ గ్రామపంచాయతీ ఏర్పడిన నుంచి నేటి వరకు సర్పంచ్‌లు గాని, వార్డు సభ్యులు గాని మాకు ప్రత్యేక గ్రామపంచాయతీ కావాలని ఏనాడు తీర్మానం చేయ లేదని తెలిపారు. ఈ ప్రక్రియను నిలిపివేయాలని అధికారులను కోరారు. గ్రామస్థుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాజుల శ్రీనివాస్, చీకట్ల కుమారస్వామి, గాజుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై క్షేత్రస్థాయి పరిశీలన

శంకరపట్నం, ఆగస్టు 24: ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న స్థలాలను అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు సంబంధించి 912మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వంకాయగూడెంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల ప్లాట్లకు క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు మండల పంచాయతీ అధికారి ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

వీణవంక, ఆగస్టు 24: మండల కేంద్రానికి చెందిన ఇటీవల ముగ్గురు అనారోగ్యంతో చికిత్స పొందిన వారికి కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆదేశాలతో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను వారి కుటుంబాలకు శనివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చినాల అయిలయ్య, నాయకులు మాదాసి సునీల్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు

- పూర్వ విద్యార్థి చేయూత

గంగాధర, ఆగస్టు 24: గంగాధర మండలం గర్షకుర్తి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు కు పాఠశాల పూర్వ విద్యార్థి చేయూతనందించారు. గ్రామానికి చెందిన1994-95లో పదో తరగతి చదివిన చిందం రమేశ్ కేరళ గ్రామీణ బ్యాంకు జీఎంగా పని చేస్తున్నారు. తాను చదివిన పాఠశాలకు ఏదైన చేయాలనే సంకల్పంతో బ్యాంకు కార్పొరేట్ సోషల్ రెస్పా న్సిబులిటి(సీఎస్‌ఆర్)లో భాగంగా 75వేల రూపాయలు అందజేశారు. పాఠశాలలో విద్యార్థుల కు గ్రంథాలయం ఏర్పాటు ఈనిధులను వినియోగించాలని సూచించారు. పాఠశాల అభివృ ద్ధికి సహకరించిన జీఎం రమేశ్‌కు ఉపాధ్యాయ బృందం, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యా ర్థులు కృతజ్ఞతలు తెలిపారు.

జ్వరాలు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హుజూరాబాద్, ఆగస్టు 24: వర్షాకాలం దృష్ట్యా జ్వరాలు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల వర్షాలు కురుస్తున్నందున వాతావరణలో మార్పులు వచ్చాయని తెలిపారు. ఇళ్ల చుట్టూ నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవా లని తెలిపారు. హుజూరాబాద్, జమ్మికుంట ప్రభుత్వాస్ప త్రులకు రూ. 30లక్షలు రోగుల సౌకర్యార్థం నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే కీలక పాత్ర



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్‌రాజు

తిమ్మాపూర్, ఆగస్టు24: భవిష్యత్తులో విద్యారంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్‌లు కీలక పాత్ర పోషించనున్నాయని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ ప్రసాద్ రాజు సూచించారు. శ్రీ చైతన్య టెక్నోలజికల్ సైన్స్‌లో శనివారం వారం రోజుల పాటు జరిగిన ఎడ్యుకేషన్ 4.0ఫ్యూచర్ డైరెక్షన్స్ ఇన్ ఏఐ అండ్ డాటా సైన్స్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐ లాంటి సాంకేతిక పరిజ్ఞానం అధ్యాప కులు అందిపుచ్చుకో వాలని చెప్పారు. లేని పరస్థితుల్లో తమ వృత్తిలో అభివృద్ధి సాధించలేక వెనుకంజలో పడిపోతారని తెలిపారు. వారం రోజుల పాటు నాణ్యతతో కూడిన శిక్షణ తీసుకొని ఉత్తీర్ణులై సర్టిఫికెట్స్ సాధించిన అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఎఫ్‌డీపీలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెదిన 52 మంది అధ్యాపకులు పాల్గొని శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ జి.సురేష్ కుమార్, ఎఫ్‌డిపి కో అర్డినేటర్ సంపత్ రెడ్డి, అధ్యాపకులు కిషోర్ కుమార్, చంద్రసేనా చారి, హరిత, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థి దశలోనే సేవా గుణం అలవర్చుకోవాలి'



అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల లియోక్లబ్ సభ్యులతో కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 24: విద్యార్థి దశలోనే సేవా గుణం అలవర్చుకోవాలని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ ఎన్‌వి రావు అన్నారు. శనివారం నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో లియో క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉన్న దాంట్లో కొంత భాగాన్ని అవసరార్థులకు వితరణ చేసి వ్యక్తిత్వ వికాస సంపన్నతకు కృషి చేయాలన్నారు. అల్ఫోర్స్ లియో క్లబ్ రాష్ట్ర స్థాయిలోనే ఉత్తమ సేవలు అందించి ముందు నిలిచిందన్నారు. ఉప గవర్నర్ కోదండరామ్ మాట్లాడుతూ సమాజహితం కోరుతూ సేవారంగాల్లో రాణించాలన్నారు. 2024-25సంవత్సరానికి ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. లయన్ ప్రోగ్రాం చైర్మన్ కెప్టెన్ డాక్టర్ బుర్రమధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ యువతలో సేవా భావాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో వివిధ కళాశాలలు, పాఠశాలల్లో లియో క్లబ్బులు ప్రారంభించడం శుభపరిణామమన్నారు.

అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల చైర్మన్ వి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి ఉపయుక్తమయ్యే వివిధ క్లబ్బులు ప్రారంభించామన్నారు. అల్ఫోర్స్ డిగ్రీ కళాశాలలో లియో క్లబ్బు ఏర్పాటుకు కృషి చేసిన శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. లియోక్లబ్ అధ్యక్షురాలిగా లియోకనక్ ముందాడ, కార్యదర్శిగా లియో జి.నాగలక్ష్మి, కోశాధికారిగా లియో కెనిశిత, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈకార్యక్రమంలో ఆర్‌సి లయన్ ఎం.సత్యనారాయణరావు, లియో జిల్లా చైర్మన్ కె.నవీన్, శాతవాహన క్లబ్ అధ్యక్ష, కోశాధికారులు లయన్ రాంమోహన్‌రావు, లయన్ సురేందర్, లయన్ ఎం మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించని మేయర్‌పై చర్య తీసుకోవాలి'

కరీంనగర్ టౌన్, ఆగస్టు 24 : ప్రభుత్వం అనుమతి తీసుకోకుండా విదేశాలకు స్వంత పనులపై వెళ్లిన మేయర్ యాదగిరి సునీల్‌రావుపై చర్య తీసుకోవాలని 44వ డివిజన్ కార్పొరేటర్ భర్త మెండి చంద్రశేఖర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శనివారం ఆయన కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ చట్టం నిబంధనల మేరకు మేయర్ విదేశాలకు వెళితే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవలసి ఉంటుందని, దీనితో ఆయన బాధ్యతలను వేరే వారు నిర్వహిస్తారని అన్నారు. సునీల్‌రావు అనుమతి తీసుకోకుండా పాలనను, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి నెల రోజుపాటు అమెరికాకు వెళ్ళారన్నారు. దీనితో అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై ప్రభావం పడుతుందని కలెక్టర్‌కు తెలిపారు. నెలకు 65వేల గౌరవ వేతనం తీసుకొంటూ నగర ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన మేయర్ నిబంధనలను పక్కనబెట్టి విదేశాలకు వెళ్లారని అన్నారు. ఆయనపై చర్యలు తీసుకొని ప్రత్యేకాధికారికి నగర పాలన బాధ్యతలను అప్పగించాలని చంద్రశేఖర్ కోరారు.

యశోద ఆసుపత్రిలో హెర్నియాకు రోబోటిక్ సర్జరీ



వివరాలు వెల్లడిస్తున్న యశోద ఆసుపత్రి డాక్టర్ కోన లక్ష్మీకుమారి

సుభాష్‌నగర్, ఆగస్టు 24: యశోద ఆసుపత్రి సోమాజిగూడ బ్రాంచిలో హెర్నియాకు అత్యాధునిక రోబోటిక్ సర్జరీ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ కోన లక్ష్మీకుమారి తెలిపారు. శనివారం నగరంలోని యశోద మెడికల్ సెంటర్‌లో విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. హుస్నాబాద్‌కు చెందిన ఉమాదేవి(67) హెర్నియాతో బాధపడుతుండగా రోబోటిక్ ఆపరేషన్ చేశామన్నారు. దీని వల్ల పేషంట్‌కు రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉండదన్నారు. ఇంట్రా ఆపరేటివ్ సమస్యలు లేకుండా ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఉమాదేవికి ఎలాంటి నొప్పి లేకుండా ఉండడంతో త్వరగా కోలుకుందన్నారు. శస్త్ర చికిత్స తర్వాత కేవలం రెండు రోజులకే డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. రోబోటిక్ సర్జరీ వల్ల వారం రోజులకే సాధారణ జీవితం గడుపుతున్నట్లు ఉమాదేవి భర్త ఆంజనేయులు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్

జమ్మికుంట రూరల్, ఆగస్టు 24: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఎస్‌హెచ్‌జీ సంఘ సభ్యులకు పరిసరాల పరిశుభ్రతపై కమిషనర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయాజ్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రతీ మహిళ ముందడుగు వేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాల వల్ల నీరు నిల్వ ఉన్న ప్రతి చోట మంగళ, శుక్రవారాల్లో డ్రైడే నిర్వహించాలని చెప్పారు. తమ ఇళ్ల చుట్టూ పక్కల ఉన్న ఇళ్లలో కూడా డ్రైడే పాటించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి సంఘ సభ్యురాలు బ్యాంకు ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సమావేశంలో మేనేజర్ రాజిరెడ్డి, సీఎల్‌ఆర్పీ జ్యోతి, ఆర్పీలు అర్షియా, షాహీన తదితరులుపాల్గొన్నారు.

ఆరోపణలు మానుకోవాలి

- ఊటూర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సతీష్

మానకొండూర్, ఆగస్టు 24: సొసైటీ పాలకవర్గం మీద చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని ఊటూర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సతీష్ అన్నారు. మండలంలోని ఊటూర్ సహకార సంఘం పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన సంఘం సభ్యుడు ఎడ్ల మల్లయ్య అనే రైతు 2016లో సంఘంలో రూ.90వేల రుణం తీసుకున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి యేటా రెన్యూవల్ చేస్తున్నారని చెప్పారు. 2023లో జూలైలో రెన్యూవల్ చేస్తున్న సందర్భంలో ఆపరేటర్ తప్పిదం వల్ల రూ. 90వేలకు బదులు లక్షా 50వేల రుణంగా నమోదు అయిందన్నారు. ఈ సాంకేతిక తప్పిదాన్ని 17 ఆగస్టు 2023తో పాటు 19 ఫిబ్రవరి 2024న సంఘం ఆధ్వర్యంలో సవరణ చేసి పంపామని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి 9 డిసెంబరు 2023లోపు లేనందున రుణమాఫీ జాబితాలో మల్లయ్య పేరు లేదని తెలిపారు. సాంకేతిక లోపం వల్ల మల్లయ్యతో పాటు ఐదుగురు రుణమాఫీ జాబితాలో పేరు లేదని వీరికి రుణమాఫీ అయ్యేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం డైరెక్టర్ మల్లయ్య, సీఈవో స్వామిరెడ్డి పాల్గొన్నారు.

గంగాధర ఏఎంసీ చైర్మన్ బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గం సభ్యులు

గంగాధర, ఆగస్టు 24: గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జాగిరపు రజిత శనివారం బాధ్యతలు స్వీకరించారు. గంగాధర మార్కెట్ యార్డు కార్యాలయంలోని ఏఎంసీ చాంబర్‌లో చైర్మన్ రజిత, వైస్ చైర్మన్ కరుణాకర్, పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా చైర్మన్ రజిత మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామ ని చెప్పారు. గంగాధర మార్కెట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలిపేందుకు పాటుపడుతామని తెలిపారు. అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు చైర్మన్ రజితతో పాటు, పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పురుషోత్తం, సూపర్ వైజర్ లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు మాంసం విక్రయాలు బంద్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 24: శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను పురస్కరించుకొని సోమవారం నగరపాలక సంస్థ పరిధిలో మాంసం విక్రయాలు పూర్తిగా బంద్ చేయాలని నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో వ్యాపారులకు సూచించారు. సోమవారం మేకలు, గొర్రెలు, ఎద్దులు, చికెన్ సెంటర్లు, వధశాలలన్నింటిని బంద్ చేయాలన్నారు. సోమవారం మాంసం విక్రయించడం చట్టరీత్యా నిషేధమని అన్నారు. నగరంలో ఎవరైనా మాంసం విక్రయిస్తే సంబంధిత వ్యాపారులను బాధ్యులను చేసి చట్టరిత్యా చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

28న సాహిత్య సమాలోచన

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు24: ఇటీవల పరమపదించిన చారిత్రక, సాంస్కృతిక, సాహిత్య పరిశోధకుడు, శాతవాహన విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ కె.ముత్యం నివాళి సమావేశం-సాహిత్య సమాలోచనను బుధవారం ఉదయం 11 గంటల నుంచి ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలుగు శాఖ అధ్యక్షుడు బూర్ల చంద్రశేఖర్ ఒక ప్రకరటనలో తెలిపారు. ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణ అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశంలో వక్తలుగా డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ గంగ్ర లక్ష్మణరావు, జీడి రమేశ్ హాజరౌతారని పేర్కొన్నారు. ముత్యం మిత్రులు, సహాధ్యాపకులు, సాహిత్యకారులు, పరిశోధకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆలయాల్లో శ్రావణ శనివారం సందడి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 24: నగరంలోని పలు ఆలయాల్లో శనివారం శ్రావణమాస సందడి నెలకొంది. వేంకటేశ్వర, హనుమదాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్‌రోడ్, మంకమ్మతోట, విద్యానగర్, జ్యోతీనగర్, కట్టరాంపూర్ వేంకటేశ్వరాలయాల్లో భక్తులు అభిషేక అర్చనల్లో పాల్గొన్నారు. మరో వైపు నగరంలోని అన్ని హనుమదాలయాల్లో పూజలు జరిపారు. ఆయా ఆలయాల నిర్వాహకులు, అధికారులు ఏర్పాట్లు చేశారు.

పండ్లు పంపిణీ

సుభాష్‌నగర్, ఆగస్టు 24: లయన్స్‌క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. శనివారం క్లబ్ బాధ్యుడు కోల అన్నారెడ్డి జన్మదినం సందర్భంగా నగరంలోని మాతా శిశు ఆరోగ్యకేంద్రంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ నవీన, చింతల కిషన్, కోల అన్నారెడ్డి, బట్టు రాజేందర్, డాక్టర్ హరికృష్ణరెడ్డి, డాక్టర్ ఎం గంగాధర్, స్టాఫ్‌నర్స్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

చొప్పదండి, ఆగస్టు 24: మొక్కలే మానవాళికి జీవనాధారమని ప్రతి ఇంటిలో విద్యార్థులు పూలు, పండ్ల మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ అన్నారు. సత్య మైక్రో క్యాపిటల్ ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వైద్యుల రాజిరెడి, సంస్థ జీఎం శ్రీనివాసులు, రీజనల్ మేనేజర్ అరుణ్ కుమార్. మేనేజర్ అఖిల్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సాంబయ్య పాల్గొన్నారు.

బధిర పాఠశాల విద్యార్థులకు బస్ పాస్‌లు పంపిణీ



విద్యార్థులకు పాస్‌లు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

భగత్‌నగర్, ఆగస్టు 24: బధితరులు ఆశ్రమపాఠశాల విద్యార్థులకు కరీంనగర్-1 డిపో, మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బస్‌పాస్‌లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ కమలా ఉదయకుమారి, చకిలం స్వప్నశ్రీనివాస్, మనోహరాచారి, టిఎస్‌ఆర్టీసీ కరీంనగర్-1 డిపో కో-ఆర్డినేటర్లు పి.సుజాత, పి సంపత్, కెశ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

'మార్కెట్ కమిటీలో అవకాశం కల్పించాలి'

ఇల్లందకుంట, ఆగస్టు 24: జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మహిళా మండలాధ్యక్షురాలు కోడం రజిత శనివారం ఒక ప్రకటనలో కోరారు. కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తనకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వాలని కోరారు.

బ్రిడ్జి ప్రారంభించాలి

రామడుగు, ఆగస్టు 24: నూతనంగా నిర్మించిన రామడుగు బ్రిడ్జిని వెంటనే ప్రారంభించాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు, న్యాయవాది కట్టెకోల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్మించిన నూతన బ్రిడ్జితో పాటు శిథిలావస్థకు చేరిన వంతెనను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో వెంటనే ప్రారంభించాలని కోరారు. లేకుంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడుతామని తెలిపారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

మానకొండూర్, ఆగస్టు 24: వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సీఐ సదన్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండపల్కల గ్రామంలో శనివారం సీఐ సదన్‌కుమార్ వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వాహనాల తనిఖీలో హెల్మెట్ లేని 15 మందికి జరిమానా విధించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

చొప్పదండి, ఆగస్టు24: చొప్పదండిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు.మండల ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని నిర్వహించగా మహిళలు 108 కలశాలతో భక్తాంజనేయ దేవాలయం నుండి వాసవి కన్యకాపరమేశ్వరి మాత ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి వాసవిమాత చాలీసా పారాయణము చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య నాయకులు మహిళలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

రామడుగు, ఆగస్టు 24: గ్రామాల్లో వర్షాల మూలంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, పారిశుధ్య పనులు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్‌యాదవ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనలో చెత్తాచెదారం పేరుకు పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

విద్యార్థికి సీఎంఏలో 35వ ర్యాంకు

హుజూరాబాద్, ఆగస్టు 24: హుజూరాబాద్ పట్టణానికి చెందిన సముద్రాల వికాస్ సీఎంఏ పరీక్షలో జాతీయ స్థాయిలో 35వ ర్యాంకు సాధించాడు. పట్టణానికి చెందిన సముద్రాల వేణుగోపాల్-రమాదేవి దంపతుల కుమారుడు వికాస్ గత నెల జూలైలో జరిగిన చార్టెడ్ అకౌంటెన్సీ పరీక్షల్లో ఉత్తీర్ణుడై, కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంట్ (సీఎంఏ) పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు.